## సత్యవేడు - వరదయ్య పాలెం మండలాలలో

# ఎస్.ఇ.జడ్. కోసం భూసేకరణ ఆపాలి

రాష్ట్ర ప్రభుత్వం చిత్తూరు జిల్లా వరదయ్యపాలెం, సత్యవేడు మండలాలలో 'స్పెషల్ ఎకనమిక్ జోన్' ఏర్పాటు చేయడం కోసం దాదాపు 12 వేల ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవాలని తాపత్రయపడుతున్న సంగతి తెలిసిందే. అందులో మూడింట రెండు వంతులు రైతుల పట్టా భూమికాగా, మిగిలిన ఒక వంతు బంజరు భూమి. అయితే ఆ బంజరు భూమిలో కూడ చాలావరకు భూమిలేని పేదలకు డి-ఫారం (స్థానిక పరిభాషలో డికెటి) పట్టాలు ఇచ్చి ఉన్నారు కాబట్టి దాదాపు మొత్తం 12 వేల ఎకరాలు వ్యవసాయ భూములే. అక్కడ చాలా చెరువులు, వందల సంఖ్యలో బావులు, బోర్లు ఉన్నాయి. వరిమళ్లు, మామిడి తోటలు, మల్లె, రోజా మొదలైన పూతోటలు, శెనక్కాయలు, సజ్జలు పండే మెట్ట భూములు ఉన్నాయి. ఈ నీటి వనరులన్నిటినీ పూడ్చి, తోటలన్నిటినీ నరికి, వరిమళ్ళు సాపుచేసి ఏవో పరిశ్రమలు నెలకొల్పడం కోసం ఒక ప్రత్యేక ఆర్థిక క్షేత్రాన్ని తయారు చేయాలన్న ఆలోచన ఎంతవరకు ఉచితమైనది?

ఈ భూములు 16 గ్రామాలలో పరచుకొని ఉన్నాయి. జనాభా 25 వేల దాకా ఉంటుంది. పశువులయితే ఒక్కొక్క ఊరిలో 4 వేల సంఖ్యలో ఉన్నాయి. వ్యవసాయ భూములే తప్ప ప్రజల ఆవాసాలు స్వాధీనం చేసుకోవడం లేదని ప్రభుత్వం అంటున్నప్పటికీ ఇక్కడ ఉంటూ ఎక్కడో పనిచేసుకొని బతకడం అయ్యేపని కాదు కాబట్టి ఈ ప్రజలంతా ఏదో ఒకరోజు 'స్వచ్ఛందంగా' ఇళ్ళు ఖాళీచేసి పశువులను మాంసం పరిశ్రమకు అమ్మి వెళ్ళిపోవలసి ఉంటుంది.

### ఇదంతా దేనికోసం?

స్పెషల్ ఎకనమిక్ జోన్ అంటే ప్రత్యేక ఆర్థిక క్షేత్రం అని అర్థం. మామూలుగా ఒకరు ఒక ఫ్యాక్టరీ నెలకొల్పాలంటే భూమి కొనుక్కొని, కరెంటు కనెక్షన్ కోసం, నీటి సరఫరా కోసం, రోడ్ల కోసం వివిధ ప్రభుత్వ శాఖలకు అర్జీలు పెట్టుకొని, సాధించుకోవాలి. వారికి ఆ బెడద లేకుండా ప్రభుత్వమే ఒక విశాల భూభాగం నుండి ప్రజలను తరిమేసి, రోడ్లు వేసి, కరెంటు వ్యవస్థ, నీటి వ్యవస్థ ఏర్పాటు చేసి, అక్కడ సంస్థలు ఏర్పాటు చేసే వారికి రకరకాల పన్ను రాయితీలు, కార్మిక చట్టాలనుండి మినహాయింపు ఇచ్చే ఏర్పాటును స్పెషల్ ఎకనమిక్ జోన్ (ఎస్.ఇ.జడ్) అంటారు. మామూలుగా దానిని ఏర్పాటు చేసిన తర్వాత ప్రభుత్వం తన చేతిలోనే ఉంచుకొని అక్కడ సంస్థలు ఏర్పాటు చేయడానికి రమ్మని ప్రైవేటు

కంపెనీలకు ఆహ్వానం పలుకుతుంది. ఇక్కడ ఆ బరువు కూడా ప్రభుత్వం దించేసుకుంది. శ్రీసిటీ (ప్రై) లిమిటెడ్ అనే సంస్థకు ఈ ఎస్.ఇ.జడ్. క్షేత్రాన్ని అప్పగించి దానిని కంపెనీలతో నింపే బాధ్యతను వారిపైన పెట్టింది. మరి అక్కడ ఏ రకమైన పరిశ్రమలు రాబోతాయి? శ్రీసిటీ వారికయినా తెలుసునో తెలియదోగానీ ప్రభుత్వానికి మాత్రం తెలియదు. ప్రజలకు తెలియజెప్పలేదు. అవి గ్రామీణులకు పని కల్పించే పరిశ్రమలా లేక భారీగా పెట్టుబడులు పెట్టి పదిమంది విద్యావంతులకు మాత్రమే ఉద్యోగాలు ఇచ్చే సంస్థలా? అదీ తెలీదు. వాటివల్ల వాతావరణ కాలుష్యం ఎంత ఉంటుంది? పోయినవాళ్ళు పోగా మిగిలినవారి బతుకులమీద ఈ ఎస్.ఇ.జడ్. ప్రభావం ఏ విధంగా ఉండబోతోంది? అది సహితం తెలీదు. అసలు నిజంగా 'అభివృద్ధి' అనేది వస్తుందా లేక క్షేత్రం యావత్తు చెన్నై రహదారికి దగ్గరగా ఉంది కాబట్టి నాలుగు పెద్ద హొటళ్ళు, రెండు ధాబాలు మాత్రమే వెలుస్తాయా? ఏమో తెలీదు.

ఏమీ తెలియకుండా 25 వేల ప్రజానీకం తమ జీవన వనరులన్నీ శ్రీసిటీ వారికి అప్పగించి ఎందుకు వెళ్ళిపోవాలి? అభివృద్ధి కోసం ప్రజలు త్యాగం చేయాలి అంటున్నారు. అది ఎట్లాంటి అభివృద్ధో తెలియకుండ కూడా త్యాగం చేయాలా? ఆ అభివృద్ధి స్వభావం ఏమిటో దానివల్ల ఎవరికి ఏమి ఒరుగుతుందో స్పష్టంగా సూచించి, దానికోసం భూములు అప్పగించే ప్రజలకు వచ్చే నష్టమెంతో కూడా అంచనా వేసి ఆ అభివృద్ధి మేలో, ఇప్పుడుండే బతుకులే మేలో నిర్ణయించడం సబబు కాదా? ఆ నిర్ణయం చేయడంలో స్థానిక ప్రజలకు భాగస్వామ్యం కల్పించడం సబబు కాదా?

కాదన్నట్టు ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. అబద్ధాలు చెప్పి, తప్పుడు ఆశలు కల్పించి, కొంతమందిని తన వ్యూహానికి అనుకూలంగా మలచుకొని, మిగిలినవారికి వారిని చూపించి లోబరుచుకొని, చివరికి ఆలస్యం చేస్తే ఏమీ ఇవ్వకుండ భూములు తీసుకుపోతాం అని బెదిరించి భూములు స్వాధీనం చేసుకునే ఆలోచనతో ప్రభుత్వం ఉంది.

వ్యవసాయంలో భద్రత లేదు కాబట్టి ఉద్యోగం సంపాదించుకోవాలన్న ఆశ వ్యవసాయ కుటుంబాల యువకులకు ఉంటుంది. దానిని ప్రభుత్వం మోసపూరితంగా వాడుకుంటున్నది. భూమిని కోల్పోయిన ప్రతీ కుటుంబంలోనూ ఒకరికి ఎస్.ఇ.జడ్. లో ఉద్యోగం ఇస్తామన్న హామీ అధికారులు ఇస్తున్నారు. అక్కడ ఏ కంపెనీలు రాబోతాయో కూడా తెలియనివారు ఉద్యోగాల హామీ ఎట్లా ఇయ్యగలరు? బట్టల మిల్లులో, చెప్పుల కర్మాగారాలో నెలకొల్పితే అందరికీ కాకున్నా కొందరికి ఉద్యోగాలు దొరకవచ్చునేమో. కానీ ఐ.టి. కంపెనీలు వస్తే? అయినా వచ్చేవన్నీ ప్రైవేటు కంపెనీలయినప్పుడు బహుశా విదేశీ పెట్టుబడులతో కూడిన కంపెనీలయినప్పుడు. స్థానికులకు ఉద్యోగాలు వస్తాయన్న హామీ రాష్ట్ర ప్రభుత్వం ఎట్లా ఇవ్వగలదు? ప్రైవేట్ కంపెనీలకు అటువంటి ఆదేశం జారీ చేసే అధికారం ప్రభుత్వానికి ఉందా? అసలు గతంలో ప్రభుత్వరంగ సంస్థల కోసం భూములు స్వాధీనం చేసుకున్న చోటయినా ఉద్యోగాలిస్తామన్న హామీని ప్రభుత్వం నిలబెట్టుకుందా? విశాఖపట్నం ఉక్కు కర్మాగారం కోసం, రామగుండం సూపర్ థర్మల్ కేంద్రం కోసం భూములు ఇదే హామీ కారణంగా అప్పగించిన రైతు కుటుంబాల యువకులు 30 సంవత్సరాలుగా ఆ హామీ అమలు

కోసం కోర్టుల చుట్టూ తిరుగుతుండడం వాస్తవం కాదేమో ప్రభుత్వాన్ని చెప్పమనండి!

సేకరించబోయే భూమిలో దాదాపు మూడవ వంతు డికెటి పట్టా భూములు కావడంతో డికెటి పట్టాదారులకు కూడా స్వంత పట్టా ఉన్న రైతులతో సమానంగా భూములకు నష్టపరిహారం ఇస్తామన్న హామీ ప్రభుత్వం ఇస్తున్నది. రాష్ట్రంలో ఎక్కడయినా అట్లా ఇచ్చారేమో ప్రభుత్వాన్ని అడగండి! స్వంత పట్టా అయినా డికెటి పట్టా అయినా భూసేకరణ చేసినపుడు నష్ట పరిహారం ఇవ్వాలని మన రాష్ట్ర హైకోర్టు ఏడుగురు జడ్జీల బెంచి ఎల్.ఎ.ఓ, చేవెళ్ల వర్సస్ మేకల పాండు కేసులో ఇచ్చిన తీర్పు అన్యాయమంటూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకొని 'స్టే' తీసుకోలేదా? తీసుకోలేదేమో ప్రభుత్వాన్ని అడగండి! అక్కడ 'స్టే' తీసుకొని ఇక్కడ సమానంగా ఇస్తామంటే మనం నమ్మాలా?

పట్టా ఉన్న రైతులకయినా ప్రభుత్వం ఇవ్వబోయే నష్టపరిహారం ఏరకమైన పునరావాసం ఇస్తుంది? ఎకరానికి రెండున్నర లక్షలో మూడు లక్షలో ఇస్తారంట. ఇక్కడున్నది ఎక్కువగా రెండు, మూడెకరాల రైతులు. వారికి ఆరేడు లక్షల నష్టపరిహారం వస్తుందేమోగాని అందరికీ అంత మోతాదులో అప్పులూ ఉన్నాయి. రైతు వ్యవసాయం చేస్తున్నంతకాలం అప్పులవాళ్లు మెడమీద కూర్చోకపోవచ్చు గానీ భూమి అప్పగించి పోతున్నాడని తెలిస్తే బాకీ తీర్చేదాకా కదలనివ్వరు. ఇంక చిన్న రైతులకు ఏమి మిగులుతుంది? భూమి లేని కూలీలకు ఎట్లాగూ నష్టపరిహారం రాదు. ఈ రెండు వర్గాలూ కలిపితే నిర్వాసితులు కాబోయే జనాభాలో వారే మెజారిటీ అవుతారు.

శ్రీసిటీ కంపెనీకి, వారి ఆహ్వానం మీద రేపు రాబోయే కంపెనీలకు వచ్చే లాభాన్ని, వారి అభివృద్ధిని 'దేశం అభివృద్ధి'గానో, 'రాష్ట్ర అభివృద్ధి'గానో పిలిచేవారు ఈ వేలాది ప్రజలకు కలిగే నష్టాన్ని 'దేశం నష్టం' గాను, 'రాష్ట్రం నష్టం'గాను భావించి దేశం, లేక రాష్ట్రం దానిని భరించాలని ఎందుకు అడగరు? అటువంటి చట్టంగాని, విధానంగానీ దేశంలో ఎందుకు లేదని ఎందుకడగరు? ఉన్నవాళ్ళ అభివృద్ధికోసం లేని వాళ్ళు పూర్తిగా పతనం అయ్యే ప్రగతిని ఎందుకు అంగీకరించాలి?

1970లలో నెల్లూరు జిల్లాలోని శ్రీహరికోట రాకెట్ కేంద్రం కోసం భూములు అప్పగించి వలసవచ్చి వరదయ్యపాలెం మండలంలోని తొండూరు సొసైటీ, శ్రీహరికోట కాలనీలలో ఉంటున్న జనాన్ని చూస్తే ప్రభుత్వం హామీలు ఎంత బూటకమో అర్థం అవుతుంది. ఒక్కొక్క కుటుంబానికి అయిదెకరాలు ఇస్తామన్నారు. రెండున్నర ఎకరాలే ఇచ్చారు. అదికూడా రాళ్లు, రప్పలు, పాము పుట్టలు నిండిన బంజరు ఇచ్చారు. దానికి పట్టా ఇవ్వడానికి 20 సంవత్సరాలు, రెండు హైకోర్టు కేసులు అవసరం అయ్యాయి. చివరికి దక్కింది డికెటి పట్టాయే. ఒక్కొక్క కుటుంబంలోనూ ఒక్కొక్కరికి ఉద్యోగం ఇస్తామన్నారు. అందరికీ కలిపి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదు. ఇప్పుడు ఎస్.ఇ.జడ్. కోసం ఆ ప్రజలు మళ్ళీ ఊళ్ళు ఖాళీ చేయాలి.

ప్రభుత్వం ఒక భరోసాతో ఉన్నట్టుంది. కొన్ని గ్రామాలలో – ముఖ్యంగా సత్యవేడు మండలంలో 20 నుండి 50 ఎకరాలదాకా భూములున్న అగ్రకులాల భూస్వాములు ఉన్నారు. వాళ్ళకు 50 లక్షల నుండి 1 కోటి రూపాయల దాకా నష్టపరిహారం దక్కుతుంది. కాబట్టి వాళ్లు భూములు ఇచ్చేసి వెళ్లిపోవడానికి సిద్ధంగా ఉన్నారు. వాళ్లే ఆ ఊర్లలో 'పెద్దమనుషులు' కాబట్టి మిగిలిన జనం నోరు నొక్కుకొని వారివెంట పోతారని ప్రభుత్వం ఆశిస్తున్నది. చెరివి గ్రామంలో ఇప్పటికే ఇది జరిగింది. ఆ పంచాయితీలో భాగమైన చిగురుపాలెం వాసులు చెరివి గ్రామపెద్దలు ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం తమ సమ్మతితో

చేసుకున్నది కాదని అంటున్నప్పటికీ ఆ ఊరికి సంబంధించిన ఒప్పందం జరిగిపోయినట్టే ప్రభుత్వం మాట్లాడుతున్నది. ఇటువంటి మోసాలకు లొంగవద్దని పేదలకు విజ్ఞప్తి చేస్తున్నాం.

నష్టపరిహారం, ఉద్యోగాలు తరువాతి సంగతి. అంతకంటే మౌలికమైన ప్రశ్నే ప్రభుత్వాన్ని అడుగుదాం. ఎప్పుడు వస్తాయో ఎన్ని వస్తాయో తెలియని కంపెనీల కోసం 12 వేల ఎకరాల సాగుభూమిని, పళ్ల తోటలను, పూతోటలను ఎందుకు ఖాళీ చేయించాలి? మహా అయితే ఒక్కొక్క కంపెనీకి నూరు, ఇన్నూరు ఎకరాల భూమి అవసరం అవుతుందేమో. ఎవరి సాగులోనూ లేని బంజరు ఆ మేరకు దొరకదా? శ్రీకాళహస్తి సమీపంలో అటువంటి బంజరు చాలా ఉందని ఆ ప్రాంత ఎమ్.ఎల్.ఎ. ప్రకటించి ఉన్నాడు. ఒకేచోట ఒక పెద్ద ఎస్టేట్ లాంటిది తయారుచేసి, ముందే రోడ్లు కరెంటూ నీళ్లూ ఏర్పాటు చేసి, రాబోయే కంపెనీలకు అప్పగించాలన్న ఈ ఆలోచన ఎందుకు? విడివిడిగా బంజరు భూములు, కోర్టు వివాదాలలో ఉన్న 2000 ఎకరాల శ్రోత్రియం భూములు ఈ ప్రాంతంలో ఉన్నాయి. శ్రోత్రియందార్లు కోర్టులో గెలిచినా ఆ భూములకు నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వమే స్వాధీనం చేసుకోవచ్చు. వాళ్లు సంతోషంగానే ఇచ్చేయగలరు. అటవీ భూమికూడ రెండు మండలాలలో విస్తారంగా ఉంది. వేరేచోట అడవుల పెంపకానికి బంజరు భూమి అప్పగించి ఇక్కడి అటవీ భూమిని తగు మొత్తంలో రేపు రాబోయే ఏదయినా కంపెనీకి కేటాయించవచ్చు. నిజంగా కంపెనీ పెట్టి అభివృద్ధి చేయాలన్న కోరిక ఉన్న వారికి ఒక్కొక్కరికీ ఒక్కొక్కచోట తగు మాత్రం భూమి ఇవ్వడానికి 16 ఊర్లు ఖాళీ చేయించనక్కరలేదు. ఈ ప్రత్యామ్నాయాలన్నీ ఉండగా, పేద రైతులు, కూలీల జీవనాధారం అయిన 12 వేల ఎకరాల సాగు భూములే అభివృద్ధికి కావలసి వచ్చాయా?

ఈ ప్రశ్నలు మనమెందుకు అడగకూడదు? దీనికి జవాబు చెప్పేంతవరకు భూసేకరణ ప్రయత్నాలన్నీ ఆపమని ప్రభుత్వాన్ని ఎందుకు డిమాండ్ చేయకూడదు?

చిత్తూరు జిల్లాశాఖ, సెప్టెంబర్ 2007